



కౌలు లక్ష్యం చేరేనా..?

సరైన మార్గదర్శకాలు.. విధి విధానాలు లేక ఆర్థికంగా చికితిపోతున్న కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వారికి ఆర్థికంగా అండగా నిలవనుంది. ఈ మేరకు కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. రెవెన్యూ, వ్యవసాయాధికారుల సమన్వయంతో ఈప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో ఈ ఏడాది 30వేల కౌలు కార్డుల పంపిణీ లక్ష్యంగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారు. కౌలు రైతులకు సైతం అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి కౌలురైతు కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించనున్నారు.

- కౌలురైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 30వేల కౌలుకార్డుల పంపిణీ
- చురుగ్గా సాగుతున్న కౌలుదారుల గుర్తింపు
- ఈ ఏడాది అన్నదాత సుఖీభవ వర్తింపు
- ప్రతి కౌలుదారు కుటుంబానికి రూ.20వేలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దసంఖ్యలో కౌలు రైతులు ఉన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవనుంది. జిల్లాలో గతేడాది 27వేల కౌలుకార్డులు అందజేయగా, ఈఏడాది 30వేల కౌలు కార్డుల లక్ష్యంగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. భూ యాజమాన్య హక్కు లేకున్నా ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న కౌలురైతులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలురైతులకు కూడా వర్తింప చేస్తున్నట్లు ప్రకటించింది. ఈపథకం కింద ప్రతి కౌలుదారు కుటుంబానికి ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో కౌలుదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖల్లో తహసీల్దార్‌లు, మండల వ్యవసాయాధికారులు తమ పరిధిలోని కౌలురైతులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది.



రుణ అర్హత కార్డులను..

కౌలుదారులను ఆదుకునేందుకు 2011లో ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్ల చట్టం రూపొందించింది. ఈచట్టం ద్వారా అర్హత కల్గిన కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను ప్రతి సంవత్సరం జారీ చేస్తారు. రుణ అర్హత కార్డుల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా చేయుటకు, పంట నష్టపరిహారం పొందేందుకు అర్హులుగా నిర్ణయించింది.

ఆర్‌బీఐ మార్గదర్శకాలు ఉన్నా..

ప్రాధాన్యత రంగ రుణాలకు సంబంధించి రిజర్వ్‌బ్యాంక్ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. వాటి ప్రకారం చిన్న, సన్నకారు, కౌలు రైతులకు ఎక్కువ రుణాలు అందేలా వెసులుబాటు కల్పించింది. తలసరిన తక్కువ రుణలభ్యత ఉన్న జిల్లాలకు ప్రాధాన్య రంగ రుణ వితరణలో 125శాతం వెయిటేజీ ఇవ్వాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు సూచిస్తున్నా ఆర్థికసంస్థలు మాత్రం అందుకు అనుగుణంగా కౌలురైతులను ప్రోత్సహించడం లేదని రైతుసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పంటలు సాగుచేస్తున్న కౌలు రైతు



అప్పులు చేసి పంటలు పండిస్తున్నా

ఎన్నో ఏళ్ల నుంచి మేము భూములను కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నా. ఏనాడు కూడా మాకు ఏ బ్యాంకు కూడా రుణం ఇవ్వలేదు. తెలిసినచోట అప్పులు చేసి వడ్డీలు చెల్లించి పంటలు పండిస్తున్నారు. ఏ ఏడాది కూడా నేను 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు పండించాను. తీవ్ర నష్టం కల్గింది. అప్పులు ఎలా చెల్లించాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

- షరఫ్‌తుల్లా, కౌలురైతు, పాములపాడు



భూ యజమానుల నుంచి అవాంతరాలు ఎదురవుతున్నాయి

కౌలుదారులకు భూయజమానుల నుంచి సరైన ధ్రువీకరణ పత్రం లభించకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక నష్టపోతున్నారు. భూములు కల్గిన యజమానులు ఆ భూమిపై రుణాలు పొందడం వల్ల, మళ్లీ కౌలుదారులకు రుణాలు ఇవ్వాలంటే బ్యాంకులు ముందుకు రావడం లేదు.

- రాజశేఖర్, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి



నిబంధనలతో గుర్తింపుకార్డులివ్వాలి

సరైన విధివిధానాలతో కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని ఆదుకోవాలి. క్షేత్రస్థాయి అధికారులు భూముల వద్దకు వెళ్లి నిజమైన కౌలుదారులను గుర్తించాలి. గుర్తించిన రైతులకు ప్రభుత్వం రుణాలు ఇప్పించడంలో బ్యాంకులను ఒప్పించాలి. అప్పుడే కౌలురైతుకు నిజమైన న్యాయం జరుగుతుంది.

- సోమన్న, ఏపీ రైతుసంఘం నాయకులు



అన్నివిధాలుగా అండగా ఉంటాం

జిల్లాలో కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. రెవెన్యూ, వ్యవసాయాధికారుల సమన్వయంతో ఈప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి అన్నివిధాలుగా అండగా ఉంటాం. భూ యజమాని కౌలుదారులకు పంటసాగుదారుల హక్కుపత్రం ఇస్తే భూయజమానికి ఎలాంటి నష్టం జరుగదు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు కార్డులు అందజేస్తాం. అన్ని గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

విద్యుత్ ఏడీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

- రవికాంత్ భార్య లాకర్‌లో 2.825 కేజీల బంగారు ఆభరణాలు
- స్వాధీనం చేసుకున్న అధికారులు
- వీటి విలువ సుమారు రూ.2.8కోట్లు ఉంటుందని అంచనా
- రైతునగరంలో సుమారు రూ.3కోట్ల విలువైన ఇళ్లు
- ఇంకా కొనసాగుతున్న విచారణ



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



సోదాల్లో పాల్గొన్న ఏసీబీ అధికారులు

నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతునగరంలో నివసిస్తున్న విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రుద్రవరం మండలం చిన్నకంబలూరులో ఆళ్లగడ్డ విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 16వ తేదీ లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 17వ తేదీన ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. అదేరోజు రైతు నగరంలోని రవికాంత్‌చౌదరి ఇంట్లో సోదాలు చేసి విలువైన పత్రాలు, ఎల్‌ఐసీ బాండ్లు, ఎఫ్‌డీలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ఆరోజు ఊర్లో లేరు. దీంతో మంగళవారం వచ్చారన్న సమాచారం మేరకు సోదాలు చేసి ఆమెను విచారించారు. ఆమె పేరు మీద ఓ పబ్లిక్ సెక్టార్ బ్యాంకులో లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. అక్కడ సోదాలు చేసి 2.825 కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వజ్రాలతో పొదిగిన హారం ఉండడం విశేషం. 41 రకాల బంగారు ఆభరణాలు ఉండగా వీటి విలువ రూ.2.8కోట్లు ఉంటుందని ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు. రైతు నగరంలోని ఇళ్లు సుమారుగా 4.4 స్వైయర్ ఫీట్‌ల్లో ఉందని, వాటి విలువ సమారుగా రూ.2నుంచి 3కోట్లు ఉంటుందని అన్నారు. ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ సోదాల్లో సీఐలు కృష్ణయ్య, శ్రీనివాసులు, సిబ్బంది దొరబాబు, విశ్వనాథ్, రాముడు, పరుశరాముడు పాల్గొన్నారు.

అమృత్‌ధార ఏదీ?

- పట్టణ వాసులకు తీరని తాగునీటి కష్టాలు
- అతీగతి లేకుండా ఆగిన పథకం
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత వైసీపీ ప్రభుత్వం
- డీపీఆర్‌కే పరిమితం
- కూటమి ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా?

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. కర్నూలు, నంద్యాల, ఆదోని మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద ఎంపిక చేశారు. ఆయా పట్టణాల్లో పనులు చేపట్టడానికి 2023వ సంవత్సరంలో పనులకు పచ్చజెండా ఊపింది. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వ నిధులను ప్రణాళికా బద్ధంగా ఉపయోగించుకోవడంలో నాటి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మేధావులు చెబుతున్నారు. కనీసం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందించలేకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. రూ.438.12 కోట్ల విలువైన ప్రాజెక్టు అతీగతి లేకుండా ఆగిపోయింది. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి వెంటనే డీపీఆర్‌లు సిద్ధంచేసి పనులు వేగవంతం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నగర శివారు కాలనీల్లో...

నగర పరిధిలో రూ.130 కోట్లతో పనులు ప్రతిపాదించారు. శివారు కాలనీలకు నేటికీ ట్యాంకర్లతోనే నీటి సరఫరా జరుగుతుంది. కల్లూరు పరిధిలో 16 వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. జగన్నాథగట్టు వద్ద 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కర్నూలు, కల్లూరు ప్రాంతాల్లో నీటి నిల్వ చేసుకునేందుకు 20 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలి. మూడు నియోజకవర్గాలకు సంబంధించి విలీనమైన మామిదాలపాడు, మునగాలపాడు, లక్ష్మీపురం తదితర గ్రామాలతో పాటు వార్డులకు తాగునీటి సరఫరా కల్పించాల్సి ఉంది. విలీన గ్రామాలు, వార్డులను కలిపితే ఒక్కపూటకి 130 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సిన చోట 95 ఎంఎల్‌డీ మాత్రమే



చేస్తున్నారు. దీంతో నగరపాలక పరిధిలో నీటి కష్టాలు తొలగడం లేదు. ప్రస్తుతం అమృత్2.0 పథకంతోనైనా తాగునీటి కష్టాలు తీరాలంటే కూటమి ప్రభుత్వం డీపీఆర్ లు పంపించాలని ప్రజలు కోరుతున్నారు. నగరపాలికతో పాటు ఆదోని, నంద్యాల మున్సిపాలిటీల్లో కూడా ఇంకా డీపీఆర్ దశలోనే ఉన్నాయి. 2025-2026 సంవత్సరానికి ఈ పథకాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

- నంద్యాలలో రూ.174.52 కోట్లతో ఐదు పనులు ప్రతిపాదించారు. 37.22 కి.మీ. మూడు రకాల పైప్‌లైన్ నిర్మాణం, 12.50 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తది తర పనులు చేపట్టాలన్నారు. శివారు కాలనీల పరిస్థితి నీటి సమస్యతో దయనీయ స్థితిలో ఉన్నాయి.
- ఆదోని పట్టణానికి రూ.133.60కోట్లు విలువైన ఆరు పనులతో ప్రణాళికలు రూపొందించారు. శివారు కాలనీలలో తాగునీటి ఇబ్బందులు వేధిస్తున్నాయి. కొన్ని పనులు మధ్యలో ఆపేశారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు

మంత్రాలయం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతిఆచార్ తెలిపారు. మంగళవారం 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ. 3,79,10,455 నగదుతోపాటు 1,830 గ్రాముల వెండి, 74 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈనగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమచేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవికులకర్ణి, కృష్ణమూర్తి, గోపి, కరణం రాఘవేంద్ర, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 356 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 'పది' సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 356 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 35 పరీక్షా కేంద్రాల్లో హిందీ పరీక్ష నిర్వహించగా 504 మంది విద్యార్థులకు గాను 148 మంది విద్యార్థులు హాజరయ్యారని, 356 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఎనిమిది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో భాగంగా నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 105 మంది విద్యార్థులకు గాను 86 మంది విద్యార్థులు హాజరు కాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా మొదటి రోజు ప్రథమ బాష పరీక్షా రెండు కేంద్రాల్లో నిర్వహించగా 124 మంది విద్యార్థులకు గాను 110 మంది విద్యార్థులు హాజరయ్యారని, 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఐసెట్‌లో 689 మంది అర్హత

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ఫలితాల్లో నంద్యాల జిల్లాకు చెందిన 689 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మే 7వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. జిల్లాకు చెందిన బాలికలు 333 మంది రిజిస్టర్ చేసుకోగా 309 మంది పరీక్షకు హాజరయ్యారు. 294 మంది విద్యార్థులు అర్హత సాధించారు. బాలురుల్లో 478 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 412 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 395మంది అర్హత సాధించారు. మొత్తంగా 721 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 689 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు.

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించండి

- కలెక్టర్ రాజకుమారి గనియా
- జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి గనియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేసు వివరాలతో కూడిన నివేదికలను వారం రోజులకు ముందుగానే డీవీఎమ్సీ సభ్యులు అందజేయాలని ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలకు కలెక్టర్ సమాధానం చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలు తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి చింతామణి, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, నంద్యాల అదనపు మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

- జిల్లాకు మంజూరు చేసిన పనులు పూర్తిచేయాలి
- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టి ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి క్షేత్రస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, స్పెషల్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు 1.25లక్షలమంది ఉపాధి కార్మికులు హాజరయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు కృషిచేయాలన్నారు. నందికొట్కూరు, మిడుతూరు, బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో సగటు రేటు రూ.266కన్నా ఎక్కువగా రావడం లేదని సరాసరి రేటు పెంచేందుకు క్షేత్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాకు మంజూరుచేసిన నీటి కుంటలు, పశువుల నీటితొట్లు, గోకులం షెడ్లు, తదితర పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇళ్లను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన 9432 గృహాల లక్ష్యాన్ని ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని హౌసింగ్ ఇంజనీర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లో ట్రీ

మండు వేసవిలో పసుపు వర్ణ పూలతో కనిపిస్తున్న ఈ వృక్షం మంత్రాలయంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఉంది. ఎంతో అందంగా ఉన్న ఈ చెట్టు మొత్తం ఇలా పసుపు రంగు పూలతోనే కనిపిస్తోంది. అక్కడక్కడా కొన్ని ఆకులు తప్ప చెట్టంతా పసుపుమయమైంది. ప్రతి ఏటా ఏప్రిల్, మే మాసంలో చెట్టు ఆకులు మొత్తం రాలిపోయి ఇలా పసుపు రంగు పుష్పాలతో మాత్రమే కనిపించడం ఈ చెట్టు ప్రత్యేకత. ఏడాదికోసారి మాత్రమే ఈ చెట్టు ఇలా దర్శనమిస్తుందని సుశీల్ ప్లాస్టిక్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ యజమాని శివాజీ తెలిపారు. ఈ ఎల్లో ట్రీ ఎదుట యువత ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మంత్రాలయం (ఆంధ్రజ్యోతి)

ఆర్డీఎస్‌కు జలకళ



ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

ప్రతి ఏటా మే నెలలో తుంగభద్ర నది నీరు లేక రాళ్లు, రప్పలతో దర్శనమిచ్చేది. ఈ ఏడాది ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో తాజాగా తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. కోసిగి మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట నిండుకుండలా కనిపిస్తోంది. దీంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రకు వరదతో ఆర్డీఎస్ ఆనకట్ట నీటితో కళకళలాడుతోంది. ఈ ఏడాది తుంగభద్ర నదిలో వేసవిలోనే వరద రావడంతో సమీప ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

- కోసిగి (ఆంధ్రజ్యోతి)

ఎవరికోసం..?



నగరంలో ఎండ తీవ్రత ఎక్కువైంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఎండల బారిన పడకుండా ప్రధాన కూడళ్లు.. బస్‌స్టాప్‌ల వద్ద చలువ పందిళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే అవి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడం లేదు. ప్రైవేట్ వాహనాలకు రక్షణగా నిలుస్తున్నాయి. నిజమైన ప్రయాణికులేమో ఎండలో తిప్పలు పడుతున్నారు. నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ పక్కన ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద వాహనాలను వాటి యజమానులు ఇలా పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు నిత్యం అటువైపుగా వస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మొత్తానికి అధికారులు ఏర్పాటు చేసిన ఈ చలువ పందిళ్లు ప్రయాణికులకు ఏమోకానీ వాహనాలకు మాత్రం పూర్తి సౌకర్యంగా నిలుస్తున్నాయి.



- కర్నూలు న్యూసిటీ (ఆంధ్రజ్యోతి)

విజయవాడకు విమానం

- జూలై 2 నుంచి సర్వీసులు ప్రారంభం
- కర్నూలు నుంచి వారంలో మూడు రోజులు

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లావాసులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుభవార్త అందించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కర్నూలు - విజయవాడ విమాన సర్వీసులు కొనసాగించేం దుకు ముహూర్తం నిర్ణయించారు. జూలై 2న కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే తొలి విమానం కర్నూలు (ఓర్వకల్లు) ఎగరనుంది. వారంలో మూడు రోజులు ఈ సర్వీసులు నడపనున్నారు. కర్నూలు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు, రైల్వే రవాణా సౌకర్యం ఉంది. సుమారు 500 కిలోమీటర్లు దూరం ఉంది. 8 గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించినా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతికి విమానాయాన సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ-3.0 ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రిగా కింజారపు రామోహ్మన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడం, మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందించారు. ఎన్నో ఏళ్ల స్వప్నం సాకారం కాబోతుండడంతో ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కర్నూలు విమానాశ్రయం నుంచి విజయవాడ సహా విశాఖపట్నం, బెంగ ళూరు, చెన్నై, షిర్డీ. ప్రధాన పట్టణాలకు విమాన సర్వీసులు నడపాలని మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు సీఎం చంద్రబాబు, కేంద్ర విమాన యాన శాఖ మంత్రి కింజారపు రామోహ్మన్ నాయుడుల దృష్టికి తీసుకె ళ్లారు. ఆయన హామీ ఇచ్చిన వారం రోజుల్లోపే విమాన సర్వీస్‌ను నడపనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వారంలో మూడు రోజులు

కర్నూలు నుంచి విజయవాడకు సోమ, బుధ, శుక్రవారం వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేలా షెడ్యూలు ఖరారు చేశారు. ఈ విమానం విజయవాడ ఎయిర్‌పోర్టులో మధ్యాహ్నం 3:45 గంటలకు బయల్దేరి కర్నూలు విమానాశ్రయానికి 4:50 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా తిరుగుప్రయాణంలో సాయంత్రం 5:10 గంటలకు బయల్దేరి 6:15కు విజయవాడకు చేరుకుంటుంది. విమాన సర్వీసులో ఒకరికి రూ.2,506గా టికెట్ ధరగా ఖరారు చేశారు.

జిల్లా ప్రజల కల

జిల్లా నుంచి విజయవాడకు విమాన సర్వీసును ఎన్నో ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేలా కేంద్రం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. హైదరాబాదు-ఓర్వకల్లుకు కూడా విమాన సర్వీసులు నడపాలని కోరుతున్నాం.

- మల్లెల రాజశేఖర్, టీటీడీ బోర్డు సభ్యులు

ఎన్నో ఏళ్ల కల సాకారం

ఉమ్మడి కర్నూలు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే విమాన సర్వీసులు ఎంతో ముఖ్యం. విజనరీ సీఎం చంద్రబాబు పదేళ్ల క్రితమే గుర్తించి ఓర్వకల్లు కేంద్రంగా 18 నెలల్లో విమానాశ్రయం నిర్మించి చరిత్ర సృష్టించారు. జూలై 2 నుంచి వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయం.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

మాట నిలుపుకున్న కేంద్ర మంత్రి

ఈ నెల 16న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కర్నూలుకు వచ్చారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి విజయవాడకు విమాన సర్వీసు నడపాలని విన్నవించాం. ఐదు రోజుల్లో మాట నిలుపుకున్నారు. జూలై 2 నుంచి సర్వీసు ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆయనకు కృతజ్ఞతలు.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి విజయవాడకు విమాన సర్వీసు రావడం సంతోషకరం. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని ఒప్పించి ఈ సౌకర్యాన్ని కల్పించాం. ప్రజలు ఈ విమాన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి. తమ విజ్ఞప్తిని స్వీకరించి అమలు చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

అందరికీ ఆరోగ్య యోగం

- నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమావేశం



కర్నూలు కల్చరల్/కర్నూలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి ఏటా జూన్ 21న నిర్వహించేలా ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐక్యరాజ్య సమితి ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏటా ప్రపంచంలో ఎన్నో దేశాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ఉగ్రవాద మూకలపై భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన తరుణంలో, దేశంలో ఆస్ఫూర్తిని అందరికీ అందిస్తూ, అలాగే ఆరోగ్య భారతావని ఆవిష్కరణలో భాగంగా భారత ప్రధాని ఈ ఏడాది జూన్ 21న రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరిగే యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్‌ను నిర్వహిం చాలని ఆదేశాలు జారీ చేసింది. బుధవారం నుంచి జిల్లాలోనూ యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ యోగా ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు గానూ మే 27న ర్యాలీ నిర్వహిస్తారు. జూన్ 2వ తేదీన రంగోలి పోటీలు, జూన్ 16న ఫ్యామిలీ యోగా నిర్వహిస్తారు. జూన్ 17న 75 ఏళ్లు దాటిన వారికి, 18, 19 తేదీల్లో అన్ని స్థాయిలలో యోగా పోటీలు నిర్వహిస్తారు.

గ్రామ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా యోగా శిక్షకులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన ముఖ్యాంశాలుగా ఉంటాయి. శిక్షణ కోసం మండలానికి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను, అర్బన్‌లో 4 వార్డులకు కలిపి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను గుర్తించి జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మే 21 నుంచి 27 వరకు గుర్తించిన ట్రైనర్ ఆఫ్ ట్రైనర్లకు జిల్లా స్థాయిలో శిక్షణ నిర్వహిస్తారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు మే 28 నుంచి జూన్ 3వరకు, గ్రామస్థాయిలో జూన్ 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి. యోగా పాటల, పెయింటింగ్, వ్యాసరచన పోటీలను పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో నిర్వహించనున్నారు.

ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మే 21నుంచి జూన్ 21 వరకు నిర్వహించనున్న యోగాంధ్ర క్యాంపెయిన్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్, అడిషినల్ ఎస్పీని ఆదేశించారు. మే 21న జిల్లాస్థాయిలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్, డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ హుసేన్‌పీరా, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో డా.శాంతికళ, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, యోగా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేయాలి



యోగా గురువులు, అభ్యాసకులు మన భారత ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. ప్రపంచంలోని అనేక దేశాలు భారత దేశం వైపు చూస్తున్నాయి. ఇక్కడి యోగ రహస్యాలను అన్వేషించాలని తపన పడుతున్నాయి. యోగ శిక్షణలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతివారూ తమ ఆరోగ్యం కోసం ఉపక్రమించాలి. యువత పాశ్చాత్య జీవన శైలిని వీడి, యోగా వైపు దృష్టి పెట్టాలి.

- టీవీ రత్న ప్రసాద్, యోగా గురువు, కర్నూలు

ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది



యోగా అనేది కంటికి కనిపించని ఒక దివ్య ఔషధం. నా జీవితంలో 16 ఏళ్లుగా నిత్యం యోగా ఆచరిస్తున్నాను. నేను గుర్తించింది ఏమిటంటే ఈ 16 ఏళ్లలో నేను ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొగల ఆత్మస్థైర్యం లభించింది. అలాగే ఎలాంటి గాయాలు తగిలినా మరో రోజుకు అవి నయం అయిపోతున్నాయి. కంటి చూపులో ఎలాంటి తేడా రాలేదు. అన్ని రకాల వ్యాధులకు, దీర్ఘకాలిక జబ్బులకు పరిష్కారంగా యోగా నిలుస్తుంది.

- ఆవేపా నాగేశ్వరరావు, యోగా అభ్యాసకుడు

ఐఎఫ్ఎస్‌కు నంద్యాల డీటీవో ఎంపిక

ఆలిండియాలో 13వ ర్యాంకు



ఐశ్వర్యారెడ్డి

నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో డీటీవోగా పని చేస్తున్న ఐశ్వర్యా రెడ్డి ఐఎఫ్ఎస్‌కు (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) ఎంపికయ్యారు. సోమవారం రాత్రి వెలువడిన తుది ఫలితాల్లో ఆలిండియా 13వ ర్యాంకు సాధించినట్లు ఆమె తెలిపారు. 2022లో గ్రూప్-1 రాసి డీటీవోగా విజయవాడలో రెండేళ్లు పనిచేశారు. ఏడు నెలల కిందట నంద్యాలకు డీటీవో(డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తూనే ఇప్పుడు ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. రోజుకు 14 గంటలు చదివినట్లు ఆమె తెలిపారు. ఆమెది కడప జిల్లా. తండ్రి రామ చంద్రారెడ్డి ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన సందర్భంగా ఐశ్వర్యారెడ్డికి పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ పరీక్షలో ఒకరు డిబార్

కర్నూలు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థిని చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ సెమిస్టర్‌కు 2,378 మందికి 2,135, 6వ సెమిస్టర్ పరీక్షకు 101మంది దరఖాస్తు చేసుకోగా 79 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. నలంద డిగ్రీ, హనుమాపురం, పెద్దకడుబూరు మండలం కళాశాలలో విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో డిబార్ చేసినట్లు తెలిపారు.

మహానాడుకు 950 మంది పోలీసులు

కర్నూలు క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో టీడీపీ ఈ నెల 27న తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 950 మంది పోలీసులు బందోబస్తుకు వెళ్తున్నారు. ఒక ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 43 మంది సీఐలు, 47 మంది ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 857 మంది పోలీసులు బందోబస్తుకు నియమించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులు కసరత్తు చేపట్టారు.

జీవాలకు జలమేదీ?

- దాహార్తితో అల్లాడుతున్న పశువులు
- జిల్లాకు 593 నీటి తొట్లు మంజూరు
- నేటికీ 60శాతం మాత్రమే పూర్తి
- లక్ష్యానికి చేరుకొని వైనం



నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో కూడా నీరు అడుగంటిపోయింది. చాలాచోట్ల జీవాలకు జలం అందక విలవిలలాడుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద కొత్తగా నీటి తొట్టెల నిర్మాణాలు శ్రీకారం చుట్టింది. ఎంత వీలైతే అంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నంద్యాల జిల్లాలో ఇప్పటికే 60శాతం పూర్తి చేసి మూగ జీవాలకు నీటికి అందిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల నీరు అందడం లేదు.

పాడి పరిశ్రమ కోసం..

నంద్యాల జిల్లాలో ఎక్కువగా వ్యవసాయం, పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ మే జూన్ నెలల్లో మూగ జీవాలకే కాదు ప్రజలకు నీటి సమస్య తలెత్తుతుంది. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునే అవకాశం ఉంది. మూగ జీవాలకు ఆపరిస్థితి లేనందున ప్రభుత్వం అప్రమత్తమై పాడి పరిశ్రమకు ఊతంగా నిధులు విడుదల చేసింది. పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుంది. పశు బీమా చేయిస్తుంది. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పాడిపరిశ్రమ పటిష్టం కావాలన్నదే ప్రభుత్వం లక్ష్యం

పంచాయతీకి రెండు..

ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పశువుల నీటి తొట్టెలు నిర్మాణాలు పంచాయతీకి రెండు చొప్పున మంజూరు చేశారు. కానీ నంద్యాల జిల్లాలో 489 పంచాయతీలు ఉన్నాయి. కానీ 593 నీటి తొట్టెలు మాత్రమే మంజూరు చేశారు. అవి కూడా రెండు నెలలైనా కేవలం 60శాతం మాత్రమే పూర్తి చేశారు. పశువులను బట్టి పంచాయతీలకు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎండకాలం పూర్తి కావస్తున్న ఇంకా పూర్తి కాకపోవడంతో పలు విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో వేచి చూడాలి.



నంద్యాల మండలం మిట్నాల వద్ద నీటి తొట్టి

జిల్లాలో మంజూరైన నీటి తొట్టెలు

నియోజక వర్గం	మంజూరు చేసినవి
ఆళ్లగడ్డ	131
బనగానపల్లె	132
డోన్	113
నందికొట్కూరు	85
నంద్యాల	31
పాణ్యం	32
శ్రీశైలం	69
మొత్తం	593

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హొళగుంద, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర వ్యయంపై హొళగుంద ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు వెంకటరమణ, మల్లేశ్వరమ్మ, విచారణ చేపట్టినట్లు ఎంపీడీవో విజయలలిత మంగళవారం తెలిపారు. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో విజిలెన్స్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండల, గ్రామ స్థాయిలో చేసిన చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన క్రీడా పరికరాలు, అనంతరం వాటిని ఎవరికీ ఇచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. క్రీడాకారులకు భోజన సదుపాయాలు వివరాలను సేకరించారు. కార్యదర్శులు రాజశేఖర్ గౌడ్, నాగరాజు, రంగస్వామి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వినియోగదారులను మోసగిస్తే సహించం

- దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం
- తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): దుకాణదారులు వినియోగదారులను మోసగిస్తే సహించమని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా వారోత్సవాలను వివిధ అనుబంధ



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

వ్యాపార సంస్థలకు అవగాహన కల్పించారు. చివరి రోజు మంగళవారం వెంకటరమణ కాలనీలోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు గ్యాస్, పెట్రోల్‌బంకు డీలర్స్ కిరాణా, బంగారు దుకాణ యజమానులు, వినియోగదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుకాణ యజమానులు వినియోగదారులను మోసగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, కర్నూలు, ఆదోని ఇన్స్‌పెక్టర్లు పరమేశ్వరకుమార్, శ్రీనివాసులు, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు శివమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో..

- పురుగుమందు తాగి రైతు బలవన్మరణం

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని మునగాల గ్రామంలో ఈఘటన చోటుచేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రంగన్న (44) తనకున్న ఎకరా పొలంతో పాటు ఐదెకరాలు కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతి ఏడాది పంటలు సరిగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. పంటల సాగు కోసం దాదాపు రూ.12లక్షలు అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం పొలం వద్ద పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. విషయం తెలుసుకున్న భార్య, బంధువులు హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సి.బెళగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పోలకల్లు గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన తిరుపాల్ కుమారుడు నాగరాజు(18) విద్యుత్ కాంట్రాక్టర్ శేఖర్ వద్ద డైలీ కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం విద్యుత్ శాఖాధికారుల అనుమతి లేకుండా విద్యుత్ పనులు చేస్తుండగా నాగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ ఏడీ జేసన్, ఏఈ సుకుమార్, ఎస్ఐ పరమేష్‌నాయక్ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు

- ఒక్కొక్కరికి రూ.25వేలు జరిమానా



శిక్ష పడిన నిందితులతో పోలీసులు

కర్నూలు లీగల్/ డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయిని విక్రయించడానికి యత్నించిన నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25వేల చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు సెషన్స్ న్యాయాధికారి కమలాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2018 డిసెంబరు 29వ తేదీన నలుగురు నిందితులు చిగురుమానుపేటకు చెందిన ఎరుకలి కావడి మురళి, ఎరుకలి గరిడి సూరి, నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన ఎరుకలి పూసల శివకుమార్, అలాగే విశాఖపట్నం గోలుగొండకు చెందిన ఎరుకుల మేకల శ్రీను డోన్ పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. అప్పటి డోన్ టౌన్ సీఐ యు.సునీల్‌కుమార్ తన సిబ్బందితో దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా.. వారు 1.2 కిలోల గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి డోన్ పరిసర ప్రాంతాల్లో విక్రయించాలని పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. కోర్టులో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సరళాదేవి వాదించారు.

పోలీసులను అభినందించిన నంద్యాల ఎస్పీ

నిందితులపై కేసు నమోదుచేసి పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో నేరం రుజువు చేసేందుకు కృషి చేసిన పోలీసు అధికారులకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అభినందించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో విచారణాధికారి శ్రమించి నిష్పక్షపాతంగా కేసును దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారని ఎస్పీ వారిని అభినందించారు.

గెలుపు సైనికులు.. టీడీపీ కార్యకర్తలు





ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- సమష్టి కృషితో విజయం సాధించాం
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో టీడీపీ కార్యకర్తలు గెలుపు సైనికులుగా మారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, తమ విజయం వారి కృషి ఫలితమేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20 వార్డులోని ఏఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీడీపీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తల సేవలు ఎన్నటికి మరవలేనన్నారు. తన గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా కష్టపడ్డారన్నారు. కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా గౌరు దంపతులు వారి ఇంటి ముందు వాలిపోతారని, సంతోషంలోనే కాదు.. కష్టాలోనూ అండగా ఉంటామని, మన అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ మనకు నేర్పించిన విజ్ఞత అని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, అందుకు కార్యకర్తలు మాకు కొండంత బలాన్ని ఇవ్వాలని కోరారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంత ఎత్తుకు ఎదిగినా కార్యకర్తలను మరవబోమని, మీరే మాకు బలం అని పేర్కొన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరైన విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో విజయం ఢంకా మోగించామని, అదే తరహాలో కూడా విజయం సాధించాలని కోరారు. వైసీపీ హయాంలో ప్రాణాలకు తెగించి నిలబడి, కష్టపడిన కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని గౌరు దంపతులను కోరారు. టీడీపీ యువనేత గౌరు జనార్థన్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ఆ పార్టీ అరాచకాలపై ధైర్యం పోరాడినోళ్లు కార్యకర్తలే అన్నారు. భూ కబ్జాలు కేసినా, అక్రమ కేసులు పెట్టి వేధించినా టీడీపీ కార్యకర్తలు భయపడకుండా అడ్రస్ లేకుండా చేశారన్నారు. అనంతరం పలు అభివృద్ధిపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఆదెన్న, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, కల్లూరు కన్వీనర్ రామాంజనేయులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మాజీ ఎంపీపీ మాధవి, పాలకొలను సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం

కల్లూరు మండలం కొంగనపాడు గ్రామం మాజీ సర్పంచ్, రైతు నాగయ్య మిరప పంటకు వైసీపీ మూకలు నిప్పుపెట్టి కాల్చేశారు. రూ.30లక్షలకు పైగా రైతు నష్టపోయాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నష్టపరిహారంగా సీఎం చంద్రబాబు రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆర్థిక సాయం చెక్‌ను రైతు నాగయ్యకు ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు అందజేశారు.

శ్రీశైలం డ్యాంను పరిశీలించిన శాస్త్రవేత్తలు



డ్యాంను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ పవర్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల బృందం మంగళవారం శ్రీశైలం డ్యాంను పరిశీలించింది. శాస్త్రవేత్తల బృందం హనుమంతప్ప, సునీల్ జె పిళ్లై, డాక్టర్ సంజయ్ బూర్లే, డాక్టర్ జీడీ నాయుడు, మహ్మద్ సీ బిస్తా తదితర శాస్త్రవేత్తలు డ్యాం ప్లంజ్‌పూల్ పరిస్థితిని ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్యాం ముందు భాగంలో దెబ్బతిన్న సిలిండర్లను, నీటినిల్వలను, నీటి తాకిడి వల్ల కోతకు గురైన ప్రాంతాన్ని తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్థితిగతులను ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర ఇంజనీర్లు వివరించారు.

మహానాడు కమిటీల్లో జిల్లా నాయకులు

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పండుగ మహానాడు నిర్వహణ కమిటీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పలువురు నాయకులకు అవకాశం దక్కింది. కడపలో ఈ నెల 27, 28, 29 తేదీంతో మహానాడును ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. మహానాడు దిగ్విజయం చేయడం కోసం రాష్ట్ర మంత్రులు, ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ముఖ్యనాయకుతో పలు కమిటీలు వేశారు. ఆ కమిటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు ఛాన్స్ దక్కింది. మహానాడు నిర్వహణలో కీలకమైన ఆర్థిక వనరుల కమిటీలో కర్నూలు జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్‌కు అవకాశం ఇచ్చారు. ఈ కమిటీకి మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని సత్యప్రసాద్ కన్వీనర్‌గా యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కన్వీనర్‌గా ఉండే కీలకమైన సమన్వయ కమిటీలో, మంత్రి అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా ఉన్న వసతి ఏర్పాటు కమిటీలో నంద్యాల జిల్లాకు చెందిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కన్వీనర్‌గా ఉన్న సభా నిర్వహణ కమిటీలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సభ్యులుగా ఉన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పత్రికా, మీడియా, షోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా అవకాశం ఇచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కన్వీనర్‌గా ఉన్న జనసమీకరణ కమిటీలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిని చేర్చారు.

గొర్రెల మేతగా క్యాబేజీ పంట



రాగిమాన్‌దొడ్డిలో గొర్రెలకు మేతగా వదిలిన క్యాబేజి పంట

పెద్దకడబూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాగిమాన్‌దొడ్డి గ్రామంలో రైతు కుమ్మరి హనుమంతు సాగు చేసిన క్యాబేజీ పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు. ఎన్నో ఆశలతో ఎకరా పొలంలో రూ.70వేలు వెచ్చించి క్యాబేజీ పంటను సాగుచేశాడు. అయితే ఒక ప్యాకెట్ క్యాబేజీ ధర కేవలం రూ.100 నుంచి రూ.150 మాత్రమే పలుకుతోంది. దీంతో చేసేది లేక పంట మొత్తాన్ని గొర్రెలకు మేతగా వదిలేశారు. ఎన్నో ఆశలతో పంటను సాగుచేస్తే రూ.70వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కూరగాయల మార్కెట్‌లో మాత్రం కొనేందుకు వెళ్తే క్యాబేజీని అధిక ధర చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రికెట్ బెట్టింగ్ జోరు



- ఆదోనిలో రంగంలోకి దిగిన పోలీసులు
- అదుపులో నలుగురు బెట్టింగ్ నిర్వాహకులు?

ఆదోని, మే 20 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాల కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఆదోని పట్టణంలో గుట్టు చప్పుడు కాకుండా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు క్రికెట్ బుకీలను ఆదోని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని తమదైన శైలిలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు రోజుల కిందట నలుగురు క్రికెట్ బుకింగ్ అదుపులో ఉంచుకొని వారిని రహస్య ప్రాంతంలో ఉంచి వారి దగ్గర నుంచి క్రికెట్ బెట్టింగ్ సంబంధించిన మరిన్ని వివరాలతో పాటు వెనుక ఉన్న తిమింగలాలు ఎవరన్న దానిపై సమాచారం రాబడుతున్నట్లు సమాచారం. గతంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బుకీల నుంచి రూ.80లక్షల పట్టుబడ్డాయి. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో అప్పటి క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధం ఉన్న ప్రధాన నిందితుడుతోపాటు మహబూబ్ నగర్ జిల్లా ఐజ పట్టణానికి చెందిన మరికొందరిని అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ఎంత మేరకు లావాదేవీలు జరుపుతున్నారు? బుకీలతో ఉన్న ప్రమేయాలపై తమదైన శైలిలో విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధాన పార్టీకి చెందిన కీలక నాయకుడి అనుచరుడు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి పేరు బయటకు రాకుండా చూసేందుకు మరో యువ నాయకుడు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఆదోని పట్టణానికి చెందిన పోలీస్ అధికారితో ప్రస్తావించగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో కొందరిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామన్నారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తే వివరాలు వెల్లడిస్తామని సమాధానమిచ్చారు.

ఫలించిన చర్చలు



- ఆందోళన కార్యక్రమాలు విరమణ
- ప్రభుత్వ స్పందనపై సర్వత్రా హర్షం
- ప్రభుత్వానికి యూనియన్ నాయకుల కృతజ్ఞతలు
- చర్చలతోనే ఏదైనా సాధ్యమంటున్న ఉపాధ్యాయ సంఘాలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానంలో పలు విధానాలను ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయి. విధి విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 21, 23వ తేదీన చేపట్టిన ఆందోళనా కార్యక్రమాలు విరమించారు. చర్చలతోనే ఏదైనా పరిష్కారం సాధ్యమవుతుందని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వం అంగీకరించిన అంశాలు

ఎస్జీటీలను మ్యాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించడం. ఉన్నత పాఠశాలల్లో 49 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో సెక్షన్ ఏర్పాటుచేయడం. ఫౌండేషన్ పాఠశాలల్లో 20 రోల్ దాటిన తర్వాత రెండవ పోస్టు ఇవ్వడం. ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రాథమిక పాఠశాలలు విడిగా నిర్వహించడం. వర్క్‌లోడ్ ఎక్కువయ్యే సందర్భంగా వర్క్‌లోడ్ ఉన్న సబ్జెక్టులకు అవసరం మేరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను లేదా సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం. స్టడీ లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఆగస్టు 2025లోపు చేరే వారి స్థానాలను బదిలీల్లో ఖాళీగా చూపరు. ప్రస్తుత బదిలీల్లో బ్లాకింగ్ లేదు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కారానికి జూన్ నెలలో కమిటీ ఏర్పాటు చేయడం. బదిలీల అనంతరం ఎమ్ఈవో, ప్రధానోపాధ్యాయుల పరస్పర బదిలీలపై నిర్ణయం తీసుకుంటామనడం.మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటినప్పుడు ప్రధానోపాధ్యాయున్ని అదనంగా కేటాయించడం.



ప్రభుత్వం సానుకూలంగా..

నూతన విద్యావిధానంలో నెలకొన్న అపరిష్కృత విధానాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ఉపాధ్యాయ సంఘాలతో సత్వర చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- రామఫక్కీరెడ్డి, పీఆర్‌టీయూ నాయకుడు



ఆందోళనను విరమిస్తున్నాం

విద్యావిధానంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో 21, 23వ తేదీల్లో చేపట్టనున్న ఆందోళనను విరమిస్తున్నాం. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా మొండివైఖరికి పోకుండా చర్చల ద్వారా పరిష్కరించడం హర్షనీయం.


- శివయ్య, ఏపీటీఎఫ్ నాయకులు, నంద్యాల



స్వాగతిస్తున్నాం

ప్రభుత్వం విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలపై సానుకూలంగా వ్యవహరించి 70 శాతం సమస్యలను పరిష్కరించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం కనీసం చర్చలు జరుపకుండా విద్యావ్యవస్థను పక్కదోవ పట్టించింది, కాని చర్చలతోనే ఏదైనా పరిష్కారం లభిస్తుందని నేటి ప్రభుత్వం భావించడం అభినందనీయం.

- నగిరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకుడు



అనేక సమస్యలు పరిష్కారం

ప్రభుత్వం ఉపాధ్యాయ యూనియన్‌లతో చర్చల ద్వారా అనేక సమస్యలను పరిష్కరించింది. ప్రైమరీ పాఠశాలలో తరగతికి ఒక టీచర్, ఒక ప్రధానోపాధ్యాయున్ని నియమించడంపై ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కానున్నాయి.

- ప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు

బైటిపేటలో పోలీసుల అవగాహన


బైటీ పేటలో నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

నంద్యాల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలపాల్లో పాల్గొంటే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున నంద్యాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమానితుల ఇళ్లు, నేర చరిత్ర కలిగిన వారి పరిసరాలు, వారి వేలి ముద్రలు మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా పరిశీలించామన్నారు. రౌడీ షీటర్ల ఇళ్లను తనిఖీ చేసి వారి నుంచి 10 బైకులు, 2 ఆటోలు సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలు తాకట్టు పెట్టుకోవడం, దొంగతనం, గంజాయి, రవాణ చేయరాదన్నారు. అటువంటి వారికి నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐ సుధాకర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

పాములపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని లేదంటే చర్యలు తప్పవని ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు. మంగళవారం పాములపాడులో కెజిరోడ్డుపై పోలీస్ సిబ్బందితో కలసి ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారి సూత్రాలను పాటించాలని లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి


పాములపాడులో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

పాములపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన దాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు నాగేశ్వరరెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, సురేశ్, శ్రీనివాసులు, రవిలు డిమాండ్‌చేశారు. మంగళవారం పాములపాడులోని సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అన్ని పంటలకు మద్దతుధరలకై పార్లమెంటులో చట్టం చేయాలని, రైతులు, కౌలు రైతుల రుణాలురద్దు చేయాలని, చిన్న, సన్నకారు రైతులకు నెలకు 10వేలు పించను ఇవ్వాలని కోరారు.

ముంపు భూములపై హక్కు లేదు

- గ్రామ పెద్దలను విచారించిన తహసీల్దార్


నెహ్రూనగర్‌లో ముంపు భూములపై విచారణ చేస్తున్న తహసీల్దార్

పగిడ్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన భూములపై ఎవరికి హక్కు లేదని, ముంపు భూముల విషయంలో గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ శివరాముడు, ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే దళితుడు శ్రీశైలం ముంపు పొలాలను గ్రామ పెద్దలు ప్రతి ఏటా సవాలు(కౌలుకు) ఇస్తూ లక్షల రూపాయలను స్వాహా చేస్తున్నారని, ముంపు భూములను పొలం లేని దళితులకు పంపిణీ చేయాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముంపు గ్రామాలైన అర్లపాడు, మూర్వకొండ, వీరాపురం, పాతకొండ ప్రాగటూరు గ్రామాలకు చెందిన పెద్దలతో తహసీల్దార్ శివరాముడు, ముచ్చుమర్రి ఎస్ఐ చంద్రశేఖర్ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేసి విచారణ చేశారు. ముంపు భూముల సమస్య పరిష్కరించే వరకు భూములను ఎవరు సాగు చేయవద్దని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు ఇప్పటి వరకు ఎంత నిధులను అభివృద్ధికి ఉపయోగించారో వాటికి సంబంధించిన వివరాలను అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సుగుణశ్రీ

నంద్యాల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండలాధ్యక్షులు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా శాఖాధికారుల దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఓబులేసు, దొమ్మరి నంద్యాల రాజు, నారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

నంద్యాల కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): రేపు నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. మంగళవా రం నంద్యాలలో విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ శోభాయాత్ర గురువారం సాయంత్రం 4గంటలకు టెక్కె మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కాల్వ శేషసాయి, కమ్మయ్య, మోహన్ కిరణ్, చింతలపల్లె వాసు, హిమశేఖర్, వెంకటసుబ్బారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో 22న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలోత వీరహనుమాన్ శోభయాత్రను నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా గురువారం సాయంత్రం 4గంటలకు ఆత్మకూరులోని అమ్మవారిశాల ఆలయం నుంచి పాతబస్టాండ్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభయాత్ర జరపనున్నారు. అనంతరం అక్కడే అభయాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించడంతో పాటు వేడుకకు విచ్చేసిన భక్తులకు అల్పాహార వితరణ చేపట్టనున్నారు.

రైతుల అప్పులను మాఫీ చేయాలి


సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని, పంటలకు దిట్టుబాటు ధరకై పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు రాజశేఖర్, వీరన్న, నాగన్న, ధనుంజయ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మం గళవారం కరివేన గ్రామంలో సచివాలయం ఎదుట ధర్నా చేపట్టి సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని మెట్ట భూములకు సాగునీరు ఇవ్వాలని, సిద్దాపురం చెరువు నుంచి పంటకాల్వలు పూర్తి చేయాలని అన్నారు. పొగాకు క్వింటాలు రూ.18వేల చొప్పున కొనుగోలు చేయాలని అన్నారు.

యార్డు దయనీయం!

- ఆత్మకూరు మార్కెట్ యార్డుకు సౌకర్యాలు కరువు
- అడవిని తలపించేలా యార్డు ప్రాంగణం
- డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక అవస్థలు
- అధ్వానంగా గోదాముల నిర్వహణ


ఓపెన్ ప్లాట్‌ఫామ్ దుస్థితి ఇలా

ఆత్మకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి):

ఆత్మకూరు మార్కెట్‌యార్డు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆత్మకూరు పట్టణంలో సుమారు 11 ఎకరాల్లో యార్డును ఏర్పాటు చేశారు. యార్డు ద్వారా ప్రతిఏటా కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా రైతులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం మార్కెటింగ్‌శాఖ అధికారులు విఫలమవుతోంది. కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, రోడ్లు, డ్రైనేజీలు లేవు. దీంతో చిన్నపాటి వర్షానికే మార్కెట్‌యార్డు చెరువును తలపిస్తోంది. అలాగే పిచ్చి మొక్కలు పెరిగి అడవిలాగా తయారైంది. మార్కెట్ యార్డు ప్రహరీ దెబ్బతిన్న ఇప్పటికే అనేక చోట్ల కూలిపోయాయి. యార్డు పరిధిలో ప్రస్తుతం 7 గోదాములు ఉన్నప్పటికీ అవి వివిధ సంస్థలకు బాడుగకు కేటాయించారు. అయితే వాటి నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అలాగే యార్డు ప్రాంగణంలోనే రూ.68లక్షలతో ఏర్పాటు చేసిన రైతు బజారు నిరూపయోగంగా మిగిలింది.



ఆదాయం ఉన్నా.. సదుపాయాలు కరువు

ఆత్మకూరు మార్కెట్ యార్డుకు సెస్ వసూళ్లతో పాటు పశుసంత, ఇతర అద్దెల రూపంలో ప్రతిఏటా రూ.3కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇందులో 20శాతం వరకు మార్కెట్ యార్డు అభివృద్ధికి ఖర్చు చేసే వెసులుబాటు ఉన్నా రైతులకు సదుపాయాలు కల్పించలేని పరిస్థితి నెలకొన్నాయి. ప్రతి శనివారం మార్కెట్ యార్డు ప్రాంగణంలో పశువుల సంత నిర్వహిస్తారు. ఇక్కడ కొనుగోలు చేసి ప్రతి జీవికి నిర్దేశించిన రుసుమును యార్డుకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అక్కడ పశువులకు తాగునీరు, నీడ తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ మొక్కుబడి చర్యలు తీసుకుంటున్నారు. పశువుల షెడ్డు కూడా శిథిలమైంది.

రైతు సేవలకు స్వస్తి

పంట దిగుబడులకు ఆరబెట్టుకునేందుకు సరైన వసతులు లేక రైతులు యార్డు ప్రాంగణంలో ఆరబెట్టుకునేవారు. అయితే యార్డు పరిధిలోని ప్రస్తుతం ఒక ఓపెన్ ప్లాట్ ఫామ్, ఒక షెడ్డు ప్లాట్‌ఫామ్ ఉండగా అందులో ఓపెన్ ప్లాట్ ఫామ్ అధ్వానంగా మారింది. అదేవిధంగా రూ.48లక్షలతో మరో షెడ్డు ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేపడుతున్నప్పటికీ ఐదేళ్లుగా ఆ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునే వసతి కూడా మార్కెట్‌యార్డు పరిధిలో కరువైంది. పంట దిగుబడులకు సంబంధించి స్థానిక మార్కెట్ యార్డులో రెగ్యూలర్ క్రయా విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటామని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నప్పటికీ నేటికి కార్యరూపం దాల్చలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయం నుంచి రైతుబంధు సేవలను నిలిపివేయడం వల్ల మార్కెట్ యార్డు ద్వారా రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.


అధ్వానంగా పశువుల తొట్టెల నిర్వహణ

యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

ఆత్మకూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు పనులకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పశువుల సంతలో సదుపాయాల కల్పనకు చొరవ తీసుకుంటాం. లోతట్టులో యార్డు ప్రాంగణం ఉండటం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా నిధుల కొరతతో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు కాగానే ఆ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- వైవీ.సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు సెక్రటరీ, ఆత్మకూరు


నిరుపయోగంగా మారిన పశువుల షెడ్డు


మధ్యలో నిలిచిపోయిన షెడ్డు నిర్మాణం


శిథిలావస్థకు చేరుకుంటున్న గోదాం

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నంద్యాల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థలలో ప్రైవేట్ రంగాన్ని అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 44 నాలుగు కార్మిక హక్కులను నాలుగు కోడ్‌లుగా విభజించి పరిపాలన చేయాలని చూస్తుందన్నారు. ఈవిధానం అమలైతే దేశవ్యాప్తంగా విద్యుత్, రవాణా, స్టీల్‌ప్లాంట్‌లలో 10 ఏళ్లకు పైగా పని చేసే ఉద్యోగులు, అనేక ప్రభుత్వ రంగసంస్థలు ప్రైవేటుపరం కానున్నాయని ఆరోపించారు. కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి మురళీధర్, మహిళా నాయకురాలు సుబ్బమ్మ, పర్కీరమ్మ, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెలుగోడు: కార్మికులకు గుదిబండగా మారిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయం వద్ద దర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యలయంలో ఆర్ఐ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగమోహన్, మహమ్మద్‌రఫీ, కిశోర్, క్రిష్ణ, బాషా, ఖాదర్, వలీ, ముర్తుజావలి పాల్గొన్నారు.

నందికొట్కూరు: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నందికొట్కూరు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులను పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ వ్యకాసా కార్మిక సంఘం నాయకుడు నాగేశ్వరరావుఆరోపించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూజిల్లా నాయకులు గోపాలకృష్ణ, నాయకులు ఉస్మాన్ బాషా, నాగన్న, నజురున్నిస్సా, డీవైఎఫ్ఐ దూదేకుల బాబు ఉపాధి కార్మిక సంఘం నాయకులు దాంగట్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రణధీర్, మంజుల, సువర్ణమ్మ, పెద్దగరాజు, నాగరాజు, తిమ్మయ్య రఫీ పాల్గొన్నారు.


నంద్యాలలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంఘాలు


నందికొట్కూరులో ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు


తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

మహానాడును జయప్రదం చేయండి


స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్, ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్ మే 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న నంద్యాలలో జరిగే పార్లమెంట్ స్థాయి మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో జరిగే నంద్యాల పార్లమెంట్ మహానాడుకు స్థలాన్ని ఎన్ఎండీ ఫిరోజ్ కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నియోజక వర్గాల నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట కార్యకర్తలు ఉన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న డ్రైవర్లు, సీపీఎం నాయకులు

నంద్యాల హాస్పిటల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలని మంగళవారం నంద్యాలలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేసి అక్కడ ధర్నా నిర్వహించి ఏవో రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కిషన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి బాలవెంకట్‌లు మాట్లాడుతూ డ్రైవర్లకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ప్రతినెల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖాజా, రఫి, రామోజీ, రాజజేంద్రప్రసాద్, సుభాన్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఉంటూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని చెంచులను (గిరిజనుల)ను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం ప్రాజెక్టు ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం గిరిజన గూడెంలో పది రోజుల పాటు నిర్వహించే జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకేంద్రాన్ని పీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెంచు మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, ఆర్థికాభివృద్ధి సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గుండాల్ నాయక్, హార్టికల్చర్ అధికారి ధనుంజయ, హెచ్ఎం వీరన్న పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బండిఆత్మకూరు మే20 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలకు రావాల్సిన ఏడు వారాల వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యకాస జిల్లాఉపాధ్యక్షుడు డేవిడ్, సీఐటీయూ జిల్లా నాయకుడు రత్నమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బండిఆత్మకూరు బస్టాండ్ నుంచి కూలీలతో కలసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. అనంతరం డీటీ గురునాథంకు వినతిపత్రం వారు అందజేశారు.

పగిడ్యాల: ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మాపురం సచివాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు పనులు చేసిన సొమ్ము చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు సునిల్, నాగన్న, జయరాజ్, స్వాములు, జయమ్మ, మరియమ్మ ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ


మృతుడి భార్యకు సాయం అందిస్తున్న పోలీస్ అధికారి

కొత్తపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ లింగస్వామి కుటుంబాన్ని నంద్యాల పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐ బీఆర్ కృష్ణయ్య, ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి మంగళవారం ఎం.లింగాపురంలో ఎస్ఐ జయశేఖర్‌తో కలిసి పరామర్శించారు. లింగాపురం గ్రామానికి చెందిన లింగస్వామి (54) అనే వ్యక్తి నంద్యాల పోలీస్ కంట్రోల్ రూమ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మంగళవారం ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి గుండెపోటుతో మరణించాడు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ఆర్థిక సాయంగా, ప్రభుత్వ సాయంగా రూ.50వేలు, పోలీసు సంఘం తరఫున రూ.50వేలును ఆయన భార్య సుహాసినికి అందించారు. బుధవారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి


టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సమాఖ్య సభ్యులు

నంద్యాల కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవ సలహాదారు, విశ్రాంత శాస్త్రవేత్త డా. కాదర్‌బాద్ రవీంద్రనాథ్, తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి, సమాఖ్య కార్యదర్శి కృష్ణారెడ్డి, డాక్టర్ కిషోర్ కుమార్, డా, నీలం వెంకటేశ్వర్లు, అవ్వారి శేషఫణి, రఫి, మాబుబాషా, నీలకంఠమాచారి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

బండిఆత్మకూరు మే20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకరాతి శిలా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠిస్తున్న విగ్రహాలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శివనాగరాజునాయక్, నాగేశ్వరరావు నాయక్, తేజనాయక్, ఈశ్వర్‌నాయక్, కెసీ కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శశిశస్త్రఖర్, మల్లేశ్వరరెడ్డి, సాయిబాబారెడ్డి, జాకీర్, ప్రసాద్, రామలింగం, మధురెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు డీఎస్ఏ స్టేడియంలో 'యోగాంధ్ర'

నంద్యాల హాస్పిటల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న డీఎస్ఏ స్టేడియంలో యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఇండోర్ స్టేడియంలో యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈ నెల 21నుంచి జూన్ 21వరకు వేర్వేరు చోట్ల యోగా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎంఎస్‌వి రాజు తదితరులు పాల్గొన్నారు.

కంఠస్థ పోటీల్లో మానసవీణకు గోల్డ్‌మెడల్

- అభినందించిన ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సభ్యులు


శ్రీగణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మానసవీణ

నంద్యాల కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మురళీ క్రిష్ణ భార్య మానస వీణ భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మైసూర్ గణపతి సచ్చిదా నంద స్వామి దత్తపీఠం వారు భగవద్గీత కంఠస్థ శ్లోకాల పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆన్‌లైన్ పరీక్ష 30నిమిషాల పాటు నిర్వహించారని, వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి గోల్డ్‌మెడల్ దక్కించుకున్నానన్నారు. ఈ పోటీల్లో పలుదేశాల నుంచి 1200మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నట్లు మానసవీణ తెలిపారు. ఈనెల 17వతేదీన మైసూర్‌లోని దత్తపీఠం నిర్వాహకులు శ్రీగణపతి సచ్చి దానంద స్వామి తనకు గోల్డ్‌మెడల్ అందించారన్నారు. ఇది అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మానసవీణను నంద్యాల ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళామండలి సభ్యులు అభినందించారు.

బిల్లులు విడుదల చేయండి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనపథకంలో పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు డీఈవో జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత నెలలుగా బిల్లులు చెల్లించలేదని, కేజీబీవీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నేటివరకు వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



బీమా పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

డోన్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. టీడీపీ కార్యకర్తలు ఎల్లయ్య (ధర్మవరం), షేక్ ఖాజాబాషా (సుందర్‌సింగ్ కాలనీ) మృతిచెందాడు. బాధిత కుటుంబాలకు పార్టీ తరుపున రూ.5 లక్షల బీమా కవరేజ్ పత్రాలను మంగళ వారం మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పార్టీ తరుపున అందించిన సాయం భవిష్యత్తులో ధైర్యంగా జీ వించేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నా యకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ధర్మవరం టీడీపీ నాయకులు బోయ సంజీవుడు, తదితరులున్నారు.

ఏపీ హంస నియోజకవర్గ అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి



నూతన అధ్యక్షుడు కుందం పురుషోత్తంరెడ్డితో కమిటీ సభ్యులు

కోవెలకుంట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హంస (హెల్త్ అడ్మిని స్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) నియోజకవర్గ అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని కమ్యూ నిటీ హెల్త్‌సెంటరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెట్ పెద్ద సం జన్న, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నూ తన సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం కార్యదర్శిగా విష్ణువ ర్ధన్‌రెడ్డి, ట్రెజరర్‌గా క్రిష్ణను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బి.రఘుబాబు, జిల్లా కార్యదర్శి సయ్యద్ షఫీ, ఉపాధ్యక్షులుగా సందీప్, త్యాగరాజు, నాగరాజు , అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్

బేతంచెర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల శాఖ గ్రంథాలయం లో సమ్మర్ ఒరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించా రు. అలాగే గ్రంథాలయంలో పలు రకాల పుస్తకాలను చదివించడం, ఆటలు ఆడించడం, డ్రాయింగ్ నేర్పించారు. గ్రంథాలయ అధికారి మధుశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను విని యోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన ఎంపీడీవో వరప్రసాదరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని శాఖల అధి కారులు హాజరై వారి ప్రగతిని చదివి వినిపించారు. మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలపై ఎవరూ మాట్లాడకపోవడంతో సాదాసీదాగా ముగిసింది. సమావేశంలో ఎంపీ టీసీ సురేశ్‌బాబు, సత్తార్, వల్లంపాటి సర్పంచ్ గార్లపాడు జగదీ శ్‌రెడ్డి, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి క్రిష్ణకుమార్, ఎంఈవో వెంకటసుబ్బయ్య, ఏపీవో శ్రీకళరెడ్డి, ఏపీయం శేఖర్, పీఆర్ఏ చెంచయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్‌రాజు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రశాంతంగా ఉండాలి

● ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళ వారం సాయంత్రం మండలంలోని బీరవోలులో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయా లకు గొడవలకు పోవద్దన్నారు. స్నేహపూరితంగా ప్రశాంతంగా జీవిం చాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బాలన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బందేనవాజ్ ఉరుసు

ప్యాపిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం హజర త్ ఖ్వాజా బందేనవాజ్ గేసుద్రాస్ ఉరుసు నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, చదివింపులు నిర్వహిం చారు. అనంతరం పురవీధుల గుండా స్వామివారిని గుర్రంపై ఊరే గింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి: వైసీపీ

డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గనపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళికృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మినీ మహానాడులో మాజీ మంత్రి బుగ్గనపై టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడారని.. ఇది తగదని అన్నారు. మాజీ మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలోని శాశ్వతమైన అభివృద్ధి పనులు చేసిన ఘనత బుగ్గనకే సాధ్యమైందని అన్నారు. సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, గజేంద్ర రెడ్డి, పోస్టు ప్రసాద్, జాకీర్ హుశేన్, బేతంచెర్ల మండల కన్వీనర్ తిరుమ లేశ్వరరెడ్డి, ఆర్ఈ రాజావర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి

డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ఆధ్వర్యంలో ఈనెల 21న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆ సం ఘం రాష్ట్ర కార్యదర్శి జెఎండీ ఇక్బాల్‌బాషా కోరారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యా ర్థులకు ఒక సెక్షన్ ఇవ్వాలని, ఆదర్శ పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులను ఎస్ జీటీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నామని జయ ప్రదం చేయాలని ఆయన కోరారు.

యాగంటిలో బీసీ ఇందిరమ్మ పూజలు

బనగానపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యా గంటి క్షేత్రంలో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ మంగళవారం పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న బీసీ ఇందిరమ్మకు ఈవో చంద్రుడు, అర్చ కులు స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

గ్రామీణ రోడ్లు అధ్వానం

● వాహనదారులకు తప్పని తిప్పలు
● వైసీపీ పాలనలో చేపట్టని మరమ్మతులు
● టీడీపీ ప్రభుత్వంలోనైనా మోక్షం లభించేనా?



కొత్తపల్లె నుంచి డి.వనిపెంట గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి

చాగలమర్రి, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీ ణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని నేలంపాడు, గొట్లూరు, డి.వనిపెంట, కొత్తపల్లె, ఓజీ తం డా, చింతలచెరువు, చిన్నవంగలి, పెద్ద వంగ లి గ్రామాలకు వెళ్లే రహదారులు నరకప్రా యంగా మారాయి. కలుగొట్లపల్లె నుంచి గొ ట్లూరు గ్రామానికి వెళ్లే రహదారి కోసం లక్ష లు ఖర్చు చేశారు. పనుల్లో నాణ్యత లేక పోవ డంతో గ్రావెల్ కొట్టుకు పోయి కంకర రాళ్లు బయట పడ్డాయి. గుంతల్లో వర్షపునీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. గొట్లూరు నుంచి నేలంపాడుకు వెళ్లే రహదారి తారు కొట్టుకు పోయి కంకర రాళ్లు బయటపడ్డాయి. గొడిగ నూరు నుంచి కొత్తపల్లె, డి.వనిపెంట, ముత్యా లపాడు, ఓజీ తండా గ్రా మాలకు వెళ్లే రహ దారులు నరకానికి నకళ్లుగా మారాయి. రా త్రి వేళలో ఆద మరిస్తే ప్రమాదాలకు గురి కావాల్సిందే. ఈ రహదారుల వెంట రాకపోక లు సాగించడానికి ప్రజలు, వాహనదారులు, రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రా మాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మ యంగా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులు చేయకుండా వ దిలేయడంతో ప్రజల కు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధి కారులు స్పందించి ఆయా గ్రామాలకు తారు రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



గొట్లూరు నుంచి నేలంపాడుకు వెళ్లే రహదారి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

డోన్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ జిల్లా అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ సమావేశ భవనంలో డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుల మందు, విత్తనాలు అమ్మే డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధి కారి మురళీకృష్ణ మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్‌లో ఎటువంటి నకిలీ విత్తనాలు, ఎరువులు, నకిలీ పురుగు మందులు విక్రయించడానికి వీల్లేదని, అటువంటి వారిపై పూర్తిగా నిఘా ఉంచామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన ధరలకు సరైన మందుల ను, ఎరువులను విత్తనాలను విక్రయించాలన్నారు. లేనిపక్షంలో చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవ సాయాధికారి కార్యాలయం నుంచి టెక్నికల్ వ్యవసాయాధికారి కళ్యాణ్ కుమార్, టెక్నికల్ ఏవో నవీన, విస్తరణ అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది ని యోజకవర్గంలోని మండలాల వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

అధికారులు అందుబాటులో ఉండాలి: ఎంపీపీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవో ప్రభాకర్

డోన్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గెస్టు హౌస్ ప్రాంగణంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అయితే.. గ్రామాల్లో సమస్యలపై పెద్దగా సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశంలో ప్రస్తావించకపోవడం విశేషం. మండల విద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ జూన్‌లో పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు మండలంలోని ఆయా పాఠశాలలకు చేరేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిల్లలకు బూట్లు తప్ప యూనిఫాం సంబంధించి కిట్లు వచ్చాయన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు అరికట్టడానికి చేపట్టే అవగాహన కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బద్దెల రాజ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్, మండల ఏఈ నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బేతంచెర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు కార్మికులను ఉద్యోగులను బాని సలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, సంజీవ నాయుడు వెంకటేశ్వర్లు, మధుశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఆవరణం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ పట్టణ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, భవన నిర్మాణ కా ర్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డోన్ పాతబస్టాండు గాంధీచౌక్‌లో..

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు చట్టాలుగా మార్చడం తగదని వెంటనే కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్, ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాతబస్టాండు గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడం తగదని హెచ్చరించారు. రైతులు, ఉద్యోగ, కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ హమాలీ యూనియన్ నాయకులు కృష్ణ, ఆటో యూనియన్ నాయకులు మస్తాన్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో:
కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మిక చట్టాలను పరిరక్షించాలని ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకర ణ ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన కా ర్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల కార్యదర్శి ఏవీ భాస్కర్ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షులు బి.నాగమద్దయ్య, సీఐటీయూ ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్ఏ చిన్న రెహిమాన్, ఆదినారాయణరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చంద్ర, లక్ష్మన్న, మద్దయ్య, అన్వేష్, నాగేశ్వరరావు, బాలు, తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలోని పాతబస్టాండులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం కమిటీ సభ్యులు శ్రీకృష్ణ పారాయణం చేపట్టారు. అనంతరం నిర్వహించిన కలువకొలను ప్రసాదశర్మ ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వృద్ధుడు అదృశ్యం

కోవెలకుంట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికా ర్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ స మీపంలో ఉన్న సుబ్బారెడ్డి అనే వృద్ధుడు ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదు. దాంతో సుబ్బారెడ్డి కూతురు పద్మజ చు ట్టుపక్కల బంధువుల వద్ద ఆచూకీ కోసం వెదికినా ప్రయోజనం లేకుండాపోయింది. దాంతో మంగళవారం కోవెలకుంట్ల పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పద్మజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఆరుబయట ఉండరాదన్నారు. వర్షాల ధాటికి మట్టి మిద్దెలు కూలే అవకాశం ఉంటుందన్నారు. రైతులు, కార్మికులు, ప్రతి ఒక్కరూ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం

● దుర్వాసనతో ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు

దొర్నిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధా న రహదారి ఇరువైపులా చెత్తాచెదారంతో నిండుకున్నది. నిత్యం ప్రజలు, అంకాలమ్మ గుడి, కుళాయిస్వామిదర్గా, గంగ మ్మ గుడి ఆలయానికి వెళ్లే భక్తులు అధిక సంఖ్యలో రాకపో కలు సాగిస్తుంటారు. దుకాణదా రులు, స్థానిక ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం వేయ డంతో దుర్గంధం వెదల్లుతోంది. దాంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛంద్ర.. స్వచ్ఛదివస్ అంటూ ప్రభుత్వం చెబుతుందే తప్పా ఇక్కడ ఆ పరిస్థితి కానరావడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికా రులు స్పందించి ప్రధాన రహదారిపై, ఇరువైపులా స్వచ్ఛత పనులు చేయించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం

డోన్ టౌన్/కొలిమిగుండ్ల/సంజామల, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఎన్టీఆర్ అభిమానులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. డోన్ పట్టణంలోని రెండు గేట్ల వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద, ఎన్‌టీకే, ఎన్టీఆర్ సంఘం అధ్యక్షులు మంగలి నాగేష్, సురేంద్రగౌడు ఆధ్వర్యంలో అన్నదానం చేశా రు. అలాగే కేఈ కృష్ణమూర్తి నగర్‌లో జూనియర్ ఎన్టీఆర్ కటౌట్‌కు పూల మాల వేసి బాణా సంచా పేల్చి కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో నందమూ రి అభిమాన సంఘం నాయకులు కొప్పుల శివరామిరెడ్డి, మోహన్ స్వామి, నాగపుల్లయ్య, రాజు, అంజనేయ, కిట్టయ్య, చాంద్‌బాషా కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆల యంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. సంజామల మండలంలోని ఆకుమల్ల గ్రామంలో టీడీపీ నాయకులు షేక్ యూనిస్ బాష ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్ అభిమానులు షేక్ ఇమామ్ హుసేన్, షేక్ మహ్మద్ కైఫ్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మిఠాయిలు తినిపించుకున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామికి పూజలు

చాగలమర్రి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టి వీడు గ్రామ రహ దారిలోగల అభ యాంజనేయ స్వా మి జయంతి ఉత్స వాల సందర్భంగా మంగళవారం వేద పండితుల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా ప్రత్యేక పూ జలు, అభిషేకాలు చేశారు. 22న అభయాంజనేయస్వామి జయం తి సందర్భంగా పతాకావిష్కరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, భజన కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

నేడు 'డయల్ యువర్ డీఎం'

డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్న ట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తె లిపారు. ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలు, సలహాలు, సూచనలు 9959225795 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు.

కౌలు కార్డు తప్పనిసరి

చాగలమర్రి, మే 20 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కౌలు కార్డు తప్పనిసరిగా పొందాలని ఏవో రంగనేతాజీ అన్నారు. మం గళవారం మండలంలోని కదిరిపురం, కొలుములపేట, మద్దూరు గ్రామాల్లో కౌలు రైతులకు పంట సాగు హక్కుపత్రాలపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, కౌలు రైతులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ జయంతి

రుద్రవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పడమటివీధిలో ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 22న స్వామివారి జయంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. అదేరోజు హనుమాన్ శోభా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయా లని కోరారు.

50 శాతం సబ్సిడీపై జీలుగ మంజూరు

రుద్రవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలానికి 50శాతం సబ్సిడీపై 300 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు మంగళవారం ఏవో సుమతి తెలిపారు. క్వింటా రూ.1230 కాగా, 50 శాతం రూ. 615 క్వింటాకు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు పది కేజీల చొప్పున పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు.

25లోగా దరఖాస్తు చేసుకోవాలి

శిరివెళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు, యర్రగుంట్ల గ్రూపు దేవాలయాల పరిధిలోని పలు ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు అర్హులైన వ్యక్తులు ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఈవోలు రామాంజ నే య శర్మ, బీవీ నరసయ్య మంగళవారం తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను నంద్యాలలోని దేవాదాయశాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. తప్పనిసరిగా తమ ఫొటో, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబర్ జత చేయాలన్నారు.

26న ఆలయాల భూములకు కౌలువేలం

శిరివెళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు 2025-26 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమి తికి బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధి కారి రామాంజనేయ శర్మ మంగళవారం తెలిపారు. ఇందులో భా గంగా గుండంపాడులోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెం దిన 63.01 ఎకరాల భూములకు ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు, అదేరోజు సాయంత్రం శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వా మి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. కౌలువేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు రూ.2వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో వాహనా ల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రోడ్డు ప్రమాదాలపై వాహనచోదకు లు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వచ్చీరాని డ్రైవింగ్‌తో వాహనాలు నడపరాదని, మద్యం తాగి డ్రైవింగ్ చే యరాదని, అతివేగంగా వాహనాలు నడపరాదని సూచించారు. చి న్నపాటి అజాగ్రత్తలు, నిర్లక్ష్యం కారణంగా ఎంతో విలువైన ప్రా ణాలు కోల్పోవాల్సి ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

25న గంగాభవాని జాతర

డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాలిక్ బాబా ఆలయం దగ్గర వెలసిన గంగా భవాని అమ్మవారి జాతర ను ఈనెల 25న నిర్వహించనున్నట్లు రజక కులపెద్దలు ని ర్ణయించారు. మంగళవారం గంగా భవాని రజక బృందం సభ్యు లు మాట్లాడుతూ ఈనెల 25న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అదేరోజు మహిళలతో బోనాలు నైవేద్యాలు సమ ర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా మారెమ్మ దేవర

ప్యాపిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతమ్మ తం డాలో మారెమ్మతల్లి దేవరను మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దేవరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, అలేబాదు పరమేష్, రామోజీనాయక్, రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల ముస్తాబు

ప్యాపిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న హనుమా న్ జయంతి సంద ర్భంగా మండలం లో ఆంజనేయస్వా మి ఆలయాలు ము స్తాబయ్యాయి. ప ట్టణంలోని మధ్య గేరి, వెంగన్న బావి ఆలయాలతో పాటు కలచట్ల, బావిపల్లి, ఏనుగమర్రి, పో తుదొడ్డి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలకు తుది మెరుగులు దిద్ది అలంకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను నిర్వహించ నున్నట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు.



ముస్తాబైన ప్యాపిలిలోని మధ్యగేరి హనుమాన్ ఆలయం

ఎయిడ్స్ నివారణపై అవగాహన

డోన్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబ స్టాండులో జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో నారాయణ కళాజాతా బృందం ఆధ్వర్యంలో ఎయి డ్స్ నివారణపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ రాకుండా తీ సుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆట, పాట ద్వారా అవగాహన కల్పించారు. హ్యాండ్స్ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్, నారా యణ కళాజాతా బృందం సభ్యులు విశ్వరాజు, సరస్వతి, ఔట్రిచ్ వర్కర్లు షాజహాన్, సోఫియా, సలీమా పాల్గొన్నారు.